

పత్తి క్వింటాల్‌కు రూ.6,560

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,560 పలికింది. కనిష్టంగా రూ.6,061, సరాసరి రూ.6,457గా నమోదైందని మార్కెట్‌ కార్యదర్శి తెలిపారు.



ఓసీపీ-3లో బోనాల పండుగ

గోదావరిఖని: ఓసీపీ-3 కార్మికులు బుధవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్మికవాడల మీదుగా ఊరేగించారు. అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్‌

మోదీ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్‌: ఈనెల 8న ఖాజీపేటలో కోచ్‌ ఫ్యాక్టరీ ప్రారంభానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్‌ కుటుంబసభ్యుల చేతిలో బందీ అయిందని, తొమ్మిదేళ్లుగా సహజసంపదను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడిస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్య, నాయకులు కౌశిక హరి, అర్జున్‌ రావు, ఠాకూర్‌ రాంసింగ్‌, ఆదికేశవరావు, సంజీవరెడ్డి, ఫహీం, పర్శ సమ్మయ్య, నరేశ్‌, శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రభావిత ప్రాంతాల్లో ఎన్టీపీసీ వెలుగులు



సోలార్‌ వీధిదీపాలు ప్రారంభిస్తున్న జీఎం

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి చేస్తోందని సంస్థ జీఎం కేదార్‌ రాజన్‌ పాండు అన్నారు. పాలకుర్తి మండలం ఎల్కలపల్లి పంచాయతీలో సీఎస్‌ఆర్‌ ఆధ్వర్యంలో రూ.17లక్షలతో ఏర్పాటు చేసిన 54 వీధి సోలార్‌ లైటింగ్‌ సిస్టంను బుధవారం ప్రారంభించారు. ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలతోపాటు వృత్తివిద్యలో శిక్షణ, బాలిక సాధికారత మిషన్‌ వంటివి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్‌ చిట్టబోయిన స్వరూప, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు బిజయ్‌కుమార్‌ సిక్దర్‌, ఆదిష్‌ పాండే, నిశాంత్‌, ఎంపీటీసీ పాలడుగుల సతీశ్‌, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటార్లతో ఎత్తిపోతలు



నంది పంప్‌హౌజ్‌లో ఎత్తిపోస్తున్న పంపులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం వద్ద నందిపంప్‌ హౌజ్‌ నుంచి కాళేశ్వరం జలాలను పంపింగ్‌ చేస్తున్నారు. రెండు మోటార్ల ద్వారా 6,250 క్యూసెక్కుల నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి పంపింగ్‌ చేసి అక్కడి నుంచి షెట్పల్లను ఎత్తి రామడుగు మండలం లక్ష్మీపూర్‌ గాయిత్రీ పంప్‌హౌజ్‌కు తరలిస్తున్నారు.

ఎల్లంపల్లిలోకి కొనసాగుతున్న పంపింగ్‌

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కాళేశ్వరం వరద నీటిని ఎత్తిపోస్తున్నారు. బుధవారం పార్వతీ పంపుహౌజ్‌ నుంచి ఎల్లంపల్లిలోకి నాలుగు మోటార్ల ద్వారా 10,440 క్యూసెక్కుల నీటిని పంపింగ్‌ చేస్తున్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న డీఆర్డీవో

పాలకుర్తి: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అది సామాజిక బాధ్యత అని డీఆర్‌డీఓ) శ్రీధర్‌ అన్నారు. మండలంలోని పుట్నూర్‌, గుడిపల్లి గ్రామాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత లేకుంటే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని, తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్‌ షెడ్లకు తరలించి పంచాయతీలు ఆదాయం పొందేలా చూసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. రామారావుపల్లిలో అవెన్యూ ప్లాంటేషన్‌ కోసం తవ్విన గుంతలను పరిశీలించి ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో షబ్బీర్‌పాషా, ఏపీఓ రమేశ్‌, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అ‘ధన’పు వసూళ్లు

- ☛ ముత్తారానికి చెందిన ఓ రైతు ఇటీవల ఎకరం వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. భూముల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్‌ కార్యాలయాల్లో నిర్వహిస్తుండగా.. రైతులు, కొనుగోలుదారులు ఆన్‌లైన్‌లో స్లాట్‌ బుకింగ్‌ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది మీసేవ కేంద్రాల్లో జరిగే ప్రక్రియ. సదరు రైతు మీ సేవకు వెళ్లగా నిర్వాహకులు వారి నుంచి రూ.వెయ్యి వసూలు చేశారు.
- ☛ ఓ రైతు మ్యుటేషన్‌ కోసం జిల్లా కేంద్రంలోని మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేశాడు. నిర్వాహకుడు అతడికి రూ.145కు రశీదు ఇచ్చాడు. కానీ.. రూ.300 వసూలు చేశాడు. పదేపదే తిరిగే పరిస్థితి లేకపోవడంతో అడిగిన మొత్తం ఇచ్చి పని కానిచ్చుకున్నాడు ఆ రైతు. మీసేవలో పని కోసం వెళ్లే ప్రతిఒక్కరూ ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొంటున్నారు.

- మీ సేవకేంద్రాల్లో ఇష్టారాజ్యం
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- చాలా కేంద్రాల్లో కనిపించని సిటిజన్‌ చార్ట్‌
- పట్టించుకోని అధికారులు, ఇబ్బంది పడుతున్న ప్రజలు



సుల్తానాబాద్‌లోని మీసేవ కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న ప్రజలు

సాక్షి, పెద్దపల్లి: ప్రతి వ్యక్తికి విశిష్ట సంఖ్య అందించేందుకు.. పారదర్శకత కోసం ఆధార్‌ కేంద్రాలను, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలు రకాల సేవలను సులభంగా, వేగంగా అందించాలనే సంకల్పంతో సర్కారు మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నీరుగారిపోతుంది. ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజు కంటే ప్రజల నుంచి నిర్వాహకులు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఎక్కువ ఇచ్చినా రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

ఆధార్‌ అప్‌డేట్‌ కోసం..

పదేళ్ల క్రితం ఆధార్‌కార్డు తీసుకుని ఆ తర్వాత అప్‌డేట్‌ చేసుకోనివారికి పింఛన్‌, రేషన్‌ వంటివి నిలిచిపోతున్నాయి. అలాగే విద్యార్థులు విద్యాసంస్థల్లో ప్రవేశాలు, పోటీ పరీక్షల సమయంలో, బ్యాంకు ఖాతా తెరవడంలో వేలిముద్రలు, చిరునామాలో తప్పులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డు అప్‌డేట్‌ అనివార్యంగా మారింది. ఆధార్‌ అప్‌డేట్‌ కోసం ప్రజలు భారీగా వస్తుండటంతో ఇదే అదునుగా చేసుకుంటున్న మీ సేవ నిర్వాహకులు అధిక వసూళ్లు చేపడుతున్నారు. మరోపక్క జనాభాకు సరిపడా కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. గతంలో సమీపంలోని మీసేవ కేంద్రానికి వెళ్తే చాలు ఇబ్బంది లేకుండా ఆధార్‌ పొందే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకపోవడంతో పరిమితంగా ఉన్న ఆధార్‌ నమోదుకేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

అవినీతిని అరికట్టాలనే..

జిల్లాలో 23 ఆధార్‌ కేంద్రాలు, 131 మీసేవ, 310 సీఎస్‌ ఆన్‌లైన్‌ కేంద్రాలున్నాయి. ప్రభుత్వం అన్ని రకాల సేవలను ఒకేచోట అందించడంతోపాటు అవినీతిని అరికట్టాలని, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండాలనే ఉద్దేశంతో మీసేవ, టీఎస్‌ ఆన్‌లైన్‌ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనల మేరకు సిటిజన్‌ చార్ట్‌ ప్రకారం సర్వీస్‌ చార్జీలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, చాలాచోట్ల అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రెట్టింపు వసూళ్లు

మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజు కంటే రెట్టింపు నగదును తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఆదాయ ధ్రువీకరణ ప్రతం, కులం, నివాసం, ఈడబ్ల్యూఎస్‌, ఓబీసీ వంటి ధ్రువీకరణ పత్రాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.45 వసూలు చేయాల్సి ఉంది. కానీ.. అసలు కంటే రెట్టింపు ఫీజు వసూలు చేస్తున్నారు. ఈసీ, లేట్‌ రిజిస్ట్రేషన్‌, బర్త్‌, డెత్‌ సర్టిఫికెట్‌, మ్యుటేషన్‌, రైతుల పొలాలకు సంబంధించిన పలు రకాల సర్వీసులకు రెట్టింపు ధర కంటే ఎక్కువగానే లాగుతున్నారు. మీసేవ కేంద్రాలపై అధికారుల తనిఖీలు లేకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ కేంద్రాల తనిఖీల బాధ్యత సంబంధిత తహసీల్దార్లకు ఉంటుంది. కానీ ఆ శాఖ అధికారులు వివిధ పనుల్లో బిజీగా ఉండడంతో తనిఖీలు చేపట్టడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారీతిన అదనంగా సర్వీస్‌చార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే విషయమై అధికారుల వివరణ కోరగా.. కేంద్రాల్లో అదనంగా వసూలు చేస్తే దరఖాస్తుదారులు 1100 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వస్తే సదరు కేంద్రంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్‌ సేవలు షురూ

- పేర్లు నమోదు చేసుకున్న వారికి వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి మంథన రాజేశ్‌. ఊరుపెద్దపల్లి. వారంలో మూడు సార్లు డయాలసిస్‌ సేవలు చేయించుకోవాలి. నాలుగేళ్లుగా కరీంనగర్‌ వెళ్లి.. వైద్యసేవలు పొంది ఇంటికి చేరుతున్నాడు. జిల్లాకేంద్ర ఆసుపత్రిలో సేవలు అందుబాటులోకి రావడంతో బుధవారం ఇక్కడే తొలిపేషెంట్‌గా వైద్యం అందుకున్నాడు.



డయాలసిస్‌ సేవలు అందిస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఐదు పడకల డయాలసిస్‌ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డయాలసిస్‌, టీహబ్‌ కేంద్రాలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఈనెల ఒకటిన వర్చువల్‌ పద్ధతిన ప్రారంభించిన విషయం విదితమే. ఈ కేంద్రంలో బుధవారం నుంచి డయాలసిస్‌ సేవలు ప్రారంభమయ్యాయి.

100 మంది పేషెంట్లు

పెద్దపల్లి ప్రాంతానికి చెందిన వందమంది డయాలసిస్‌తో బాధపడుతున్నారు. వారంలో మూడు రోజులు కరీంనగర్‌, జగిత్యాల, గోదావరిఖనిలోని ఆసుపత్రులకు వెళ్లి సేవలు పొందుతున్నారు. తాజాగా ప్రభుత్వాసుపత్రిలోనే డయాలసిస్‌ సేవలు అందుబాటులోకి రావడంతో దూరభారం తగ్గిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేర్ల నమోదు తప్పనిసరి

ఇప్పటివరకు ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో సేవలు పొందుతున్నవారు అక్కడ తమ పేర్లను తొలగించుకుని.. ఇక్కడ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అప్పటినుంచి నిరంతరాయంగా ఇక్కడే సేవలు పొందే వీలుంటుందని చెబుతున్నారు. అయితే డయాలసిస్‌ కేంద్రంలో పనిచేసే సిబ్బంది ఇంకా విధుల్లో చేరలేదు. తొలిరోజు ధర్మపురిలో పనిచేసే సిబ్బంది వచ్చి ఇక్కడ సేవలు అందించారు.

మెరుగైన సేవలందిస్తాం



జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్‌ సేవలు పొందాలనుకునే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. బాధితులకు ఇప్పటికే సమాచారమందించాం. పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ మెరుగ్గా సేవలందిస్తాం.

– శ్రీధర్‌, డీసీహెచ్‌ఎస్‌

పర్యాటకంపై అధికారుల పట్టింపేది?



తుమ్మ పొదల్లోకి కొట్టుకుపోయిన బోటు



ఫ్లోటింగ్‌ప్లాట్‌ ఫాం పరిశీలిస్తున్న నాయకులు (ఫైల్‌)

- తుమ్మ పొదల్లో మూలుగుతున్న బోట్‌
- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన ఫ్లోటింగ్‌ ప్లాట్‌ఫాం
- ప్రతిపాదనల్లోనే హరితహోటల్‌

గోదావరిఖని: జిల్లావాసులకు ఆహ్లాదం పంచేలా.. గోదావరి అందాలు చూపించేలా తీర్చిదిద్దాల్సిన పర్యాటకం అటకెక్కింది. రెగెట్టా పోటీలు.. నదిలో బోటింగ్‌ షికారు అంటూ ప్రజలను ఊరించి ఉసూరుమనిపించారు. పర్యాటకం పడకేయగా.. బోటింగ్‌ తుమ్మ పొదల్లో మూలుగుతోంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన డబుల్‌డెక్కర్‌ ఏసీ బోట్‌ భారీ వర్షాలకు కొట్టుకుపోయి తుమ్మపొదల్లో చేరింది. షికారు కోసం నది తీరం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్‌ ప్లాట్‌ఫాం వరదలకు కొట్టుకుపోయింది. గోదావరి తీరానికి వచ్చే పర్యాటకుల కోసం నిర్మిస్తామన్న హరిత హోటల్‌ జాడలేకుండా పోయింది.

- రెండు జిల్లాల సరిహద్దులను కలిపే గోదావరిఖని వద్దనున్న గోదావరి తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అధికారులు, పాలకులు ప్రకటించారు. పెద్దబోటు విడి భాగాలు తెప్పించి ఇక్కడే తుదిరూపం ఇచ్చారు. అయితే బోటు నిర్మాణం పూర్తయిన కొద్దిరోజులకే భారీ వరదలు రావడంతో హైవే రహదారి పక్కన తుమ్మ పొదల్లో చిక్కింది. నదిలో బోటింగ్‌ షికారు కోసం నదిలోకి వెళ్లేందుకు ఫ్లోటింగ్‌ ప్లాట్‌ఫాం (నీటిలో తేలియాడే ప్లాట్‌ఫాం) వర్షాలకు నామరూపాలు లేకుండాపోయింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో ఏడాది పొడవునా గోదావరినది నీటితో కళకళలాడుతోంది. ఈ క్రమంలో గోదావరితీరం మరో కోనసీమగా మారుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశపడ్డారు. నదితీరంలో సమ్మక్క, సారలమ్మ జాతర, స్నానాలకు వీలుగా పుష్కరఘాట్‌, పర్యాటకులకు ఆసక్తి పెంచేలా రెగెట్టా పోటీలు, నదిపై ఉన్న రెండు బ్రిడ్జిలపై నిల్చుని పోటీలను వీక్షించే వీలుంది. వీకెండ్‌లో పడవ ప్రయాణం కోసం రూ.80లక్షలతో పర్యాటక శాఖ నుంచి డబుల్‌డెక్కర్‌ ఏసీ బోట్‌ కొనుగోలు చేశారు. అంతా సిద్ధమై త్వరలో ప్రారంభమవుతుందనే క్రమంలో భారీ వర్షాలు రావడంతో పడవ తుమ్మపొదల్లోకి చేరింది. దానికి మరమ్మతు చేసే చర్యలు లేకుండా పోయాయి. ఏసీకి సంబంధించిన కాపర్‌ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లడంతో ప్రారంభానికి రెండు నెలలు జాప్యం జరిగింది.

పర్యాటకానికి అనుకూలంగా గోదావరితీరం

పారిశ్రామిక ప్రాంతానికి సమీపంలోని గోదావరి నది తీరం పర్యాటక క్షేత్రంగా విరాజిల్లేందుకు అన్ని వసతులున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ పవర్‌ ప్లాంట్‌, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ సంస్థలతో పాటు గోదావరి బ్రిడ్జికి కొద్ది దూరంలో సుందిళ్ల బ్యారేజీ సందర్శన స్థలం ఉంది. గోదావరినది తీరం వెంట వంద ఫీట్ల రహదారి, ఏర్పాటు ఇరువైపులా పచ్చని చెట్లు, పచ్చిక బైళ్లతో మరో కోనసీమగా మార్చే అవకాశాలు బోలెడు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం మూలంగా పర్యాటకానికి జాప్యం జరుగుతోంది.

నిలిచిన రెగెట్టా పోటీలు..

గోదావరినదిపై సుందిళ్ల బ్యారేజీ ఏర్పాటుతో నది ఏడాది పొడవునా నీటితో నిండుకుండలా మారింది. ప్రతియేటా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లో నిర్వహిస్తున్న మాదిరిగా గోదావరినదిలో రెగట్టా పోటీలు ఒక్కసారి విజయవంతంగా నిర్వహించారు. రెగెట్టా పోటీలను స్వయంగా పరిశీలించిన సీఎం కేసీఆర్‌ గోదావరితీరాన్ని మరింత పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చందర్‌కు సూచించారు. దీంతో రెండు బోట్లు, ఫ్లోటింగ్‌ ప్లాట్‌ఫాం, రూ.80లక్షలతో తెప్పించిన బోట్‌ నీటి పాలయ్యాయి. ప్రస్తుతం గోదావరితీరం వీక్షించే వారు లేక బోసిబోతోంది.



వరదనీటిలో వాకింగ్‌ ట్రాక్‌

గోదావరిఖని: ఇటీవల నిర్మించిన వాకింగ్‌ ట్రాక్‌ వర్షం నీటిలో మునిగింది. ఆర్జీ-2 ఏరియాలోని అబ్దుల్‌కలాం స్టేడియంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాకింగ్‌ ట్రాక్‌పై వర్షం నీరు చేరింది. అధికారుల ప్రణాళిక లోపంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వాకర్స్‌ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వరద నీటి ప్రభావం ఉంటుందని తెలిసినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నాయి.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

- రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి
- జిల్లాకేంద్రంలో డీసీపీ కార్యాలయం ప్రారంభం
- శాశ్వత భవనానికి ప్రతిపాదనలు



డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీపీ

పెద్దపల్లిరూరల్‌: ప్రజాసహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. డీసీపీ వైభవ్‌ గైక్వాడ్‌తో కలిసి మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లా పోలీసు అధికారి కార్యాలయం భవనాన్ని ఎన్టీపీసీ సహకారంతో ఆధునీకరించి ప్రారంభించుకున్నామని తెలిపారు. డీసీపీ కార్యాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించామని, త్వరలోనే పనులు చేపట్టి ఈ ఏడాదిలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీపీలు ఎడ్ల మహేశ్‌, గిరిప్రసాద్‌, సీఐ అనిల్‌, సత్యనారాయణ, జగదీశ్‌, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

- డీసీహెచ్‌ఎస్‌ శ్రీధర్‌ వెల్లడి
- ఏజెన్సీలకు నలుగురు పారిశుధ్య కార్మికుల సరెండర్‌

పెద్దపల్లిరూరల్‌: జిల్లాకేంద్ర ఆసుపత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వైద్యసేవలన్నీ పూర్తిగా ఉచితమని ఆసుపత్రుల సూపరింటెండెంట్‌ శ్రీధర్‌ అన్నారు. ఆసుపత్రిలో ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ అందిన ఫిర్యాదులపై బుధవారం మెడికల్‌ సూపరింటెండెంట్‌ శౌరయ్య, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ హెడ్‌నర్సులు, శానిటేషన్‌ మేనేజర్‌ సంపత్‌, క్వాలిటీ మేనేజర్‌ అనిల్‌తో కలిసి విచారణ చేపట్టారు. నలుగురు పారిశుధ్య కార్మికులు లంచం అడిగినట్లు నిర్ధారణ కావడంతో వారిని విధుల నుంచి తొలగించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆసుపత్రిలో వైద్యసేవలకోసం వచ్చిన వారు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దన్నారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరయ్యేలా బయోమెట్రిక్‌ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఓపీ సమయంలో బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

యువత ఉపాధి కల్పనే లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌



చందర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ తెలిపారు. అమెరికాలో పలు ఐటీ కంపెనీల నిపుణులు, వ్యవస్థాపకులతో చర్చలు ముగించుకుని బుధవారం హైదరాబాద్‌ చేరుకున్న ఆయనకు శంషాబాద్‌ ఎయిర్‌పోర్టు వద్ద పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రామగుండంలో ఐటీ పార్కు ఏర్పాటు కోసం ఐటీ కంపెనీల నిపుణులతో చర్చలు సఫలం అయ్యాయని, ఇక్కడ కంపెనీలు పెట్టేందుకు ముందుకొస్తామని చెప్పారని వివరించారు. సుమారుగా 75 కంపెనీలు రామగుండంలో తమ శాఖలను ప్రారంభించేందుకు సుముఖత వ్యక్తం చేశాయని, మొదటి దశ 50 నుంచి 100 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే రామగుండం ఎన్నారై అభివృద్ధి ఫోరం ఏర్పాటు చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

యైటింక్లయిన్‌కాలనీకి చెందిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ మండల వైస్‌ ప్రెసిడెంట్‌ దాసరి రాజమొగిళి పార్టీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్పొరేటర్‌ సాగంటి శంకర్‌, దాతు శ్రీనివాస్‌, మేడి సదయ్య ఉన్నారు.





ఇదీ తాగునీరే..!

రామగుండం: స్థానిక బీకాలనీ జెన్‌కో క్వార్టర్లకు నల్లాల ద్వారా మురికినీరు వస్తోంది. ఇలా కలుషితమైన నీరు సరఫరా అవుతోందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. స్పందన ఉండడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. బుధవారం సరఫరా అయిన నీరు బురద, దుర్వాసనతో కూడిన నీరు రావడంతో ఉద్యోగుల కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ వేణుగోపాల్

ఎలిగేడు(పెద్దపల్లి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు దాన్ని బాధితుడికి అందజేశారు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ వివరాల ప్రకారం.. ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన పొన్నాల ఉపేందర్ తన ఫోన్‌ను శివపల్లి నుంచి ఎలిగేడు వెళ్లే దారిలో పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, ఫోన్‌ను గుర్తించారు. బుధవారం బాధితుడిని పిలిపించి, ఎస్సై చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): జూలపల్లి గ్రామానికి చెందిన పిడుగు రామస్వామి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గోదావరిఖని టూటౌన్ పోలీసులు గుర్తించి, బాధితుడికి అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. రామస్వామి తన ఫోన్‌ను ఓసీపీ-1 సైట్ ఆఫీస్‌కు వెళ్లే దారిలో పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, ఫోన్‌ను గుర్తించారు. సీఐ వేణుగోపాల్, ఎస్సై చంద్రశేఖర్‌లు బుధవారం అతన్ని పిలిపించి, సెల్‌ఫోన్ అందజేశారు. వారికి రామస్వామి కృతజ్ఞతలు తెలిపాడు.

ఓసీపీ-2 గనిపై భద్రతా సదస్సు



కమాన్‌పూర్(రామగిరి): నా భద్రత–నా బాధ్యత, నా భద్రతే నా కుటుంబ భద్రత అనే అంశంపై సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న భద్రతా అవగాహన సదస్సులో భాగంగా బుధవారం ఓసీపీ-2 ఉపరితల గనిపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా ముఖ్య అతిథిగా హాజరై, ఉద్యోగులకు భద్రతపై పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఉద్యోగులు వారి భద్రతను బాధ్యతగా స్వీకరించినప్పుడే ప్రమాదాలను నివారించగలరని తెలిపారు. ప్రాజెక్టు ఇంజనీర్ ఎం.నాగరాజు, మేనేజర్ రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్, పర్యావరణ అధికారి నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, పిట్ సెక్రటరీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఎలక్ట్రీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో ట్రైనీ ఎలక్ట్రీషియన్ అంతర్గత పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. సంస్థ వ్యాప్తంగా 79 పోస్టులు భర్తీ చేయనున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు సీఆర్‌పీ/పీఈఆర్/ఆర్/2023/657 పేరిట ఆదేశాలు జారీ అయ్యాయి. ఓపెన్ టు ఆల్ 4, ఓసీలకు 29, బీసీ-ఏలకు 8, బీసీ-బీలకు 5, బీసీ-డీలకు 5, బీసీ-ఈలకు 5, ఎస్సీలకు 9, ఎస్టీలకు 14 పోస్టులు కేటాయించారు.

టమాట 120 పచ్చిమిర్చి 120



- ఆకాశాన్నంటిన ధరలు
- ఇతర కూరగాయలదీ ఇదే పరిస్థితి
- కొనుగోలుకు పేద, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): కూరగాయల ధరలు ఆకాశాన్నాంటాయి. పెరిగిన రేట్లు పేద, మధ్యతరగతి ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాగైతే బతికేదెలా అంటూ వారు ఆందోళనకు గురవుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, దిగుమతి లేకపోవడమే ఇందుకు కారణం. వారం, పది రోజుల క్రితం రూ.150కి వచ్చిన నిత్యావసర సరకులు ఇప్పుడు రూ.500 పట్టుకెళ్లినా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని మార్కెట్లలో ధరలు చూసి, బెంబేలెత్తుతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

మొన్నటిదాక కిలో రూ.60 ఉన్న పచ్చిమిర్చి ధర ఇప్పుడు రూ.120కి చేరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం నుంచి వ్యాపారులు మిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు చేరేసరికి రవాణా చార్జీలు కలిపి, రేటు మూడింతలు పెరిగింది. టమాట కిలో రూ.120 పలుకుతోంది. కాకరకాయ రూ.80, బెండకాయ రూ.80, దొండకాయ రూ.70, దోసకాయ రూ.50, క్యారెట్ రూ.80కి చేరాయి. వీటిని ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. దీని ప్రభావం ధరలపై కనిపిస్తోంది.

కొత్తిమీర కిలో రూ.200..

కూరగాయలు కొన్నాక కొత్తిమీర అడగటం పరిపాటి. ఇప్పుడు రూ.5కి ఇవ్వలేమని వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. రూ.10కి నాలుగైదు కాడలు చేతిలో పెడుతున్నారు. అదేమిటని అడిగితే.. మొన్నటివరకు కిలో రూ.40 ఉంటే ఇప్పుడు రూ.200 అయిందని అంటున్నారు. కొత్తిమీర కర్ణాటక నుంచి దిగుమతి అవుతుండగా జిల్లాకు చేరుకునేసరికి వేడికి వాడిపోతోంది. రవాణాతోపాటు నష్టం కూడా ప్రజలపైనే వేస్తుండటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. కాకరకాయలు ఒంటిమామిడి, టమాట మదనపల్లి, నిజామాబాద్ నుంచి, క్యాప్సికం, బీన్స్ బెంగళూరు నుంచి, కాలీఫ్లవర్, క్యాబేజీ, బీట్‌రూట్, కీరా బోయినపల్లి నుంచి, క్యారెట్ హైదరాబాద్ నుంచి, చామగడ్డ సికింద్రాబాద్ నుంచి దిగుమతి అవుతున్నాయి.

రవాణా, సరఫరాలో జాప్యమే కారణం

జిల్లాలో కూరగాయల సాగు నామమాత్రంగా ఉంటోంది. రైతులు వేసవిలో బెండకాయ, వంకాయ మాత్రమే పండించారు. భానుడు నిప్పులు చెరగడంతో వాటి దిగుబడి పెద్దగా రాలేదు. ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన వర్షాలతో కొంత నష్టం వాటిల్లింది. దీంతో వచ్చిన దిగుబడి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. టమాట, కాకరకాయ, తదితర వాటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడక తప్పడం లేదు. ఇందుకోసం రవాణా వ్యయం అధికంగా అవుతోంది. సరఫరాలో జాప్యం జరిగితే అవి వాడిపోతుండటంతో ఆ నష్టంతోపాటు దళారుల బెడద కూడా వినియోగదారుడిపైనే పడుతోంది. స్థానికంగా కూరగాయల లభ్యత పెరిగితే తప్ప ధరలకు కళ్లెం వేయలేమని వ్యాపారులు అంటున్నారు.

సామాన్యులకు ఆర్థిక భారం



మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా సంచి నిండా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. నిత్యం వంటల్లో పచ్చిమిర్చి, కొత్తిమీర, టమాట ఉండాల్సిందే. ధరల పెరుగుదల సామాన్యులకు ఆర్థిక భారంగా మారింది.

– ఆసియా, గృహిణి, సుల్తానాబాద్

ధరలను నియంత్రించాలి



దళారులు కూరగాయల రేట్లు అధికంగా పెంచి, విక్రయిస్తున్నారు. మార్కెట్, తూనికలు, కొలతల అధికారులు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. లేకపోతే పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేరు.

– రాధిక, గృహిణి , సుల్తానాబాద్

‘కన్వేయన్స్’ యజమానుల నిరవధిక సమ్మె

- నేటి నుంచి సింగరేణి వ్యాప్తంగా 4 వేల వాహనాలు బంద్
- నిలిచిపోనున్న పనులు



సమ్మె నోటీసుతో వాహనాల యజమానులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామాల యువతను ఉపాధి పేరుతో ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని కన్వేయన్స్ వాహనాల యాజమానులు ఆరోపిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రైవేట్ వాహనాల ఓనర్లు గురువారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యాజమాన్యానికి అందజేసినప్పటికీ సానుకూలంగా స్పందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించారు. జీఎం వాహనంతో సహా ఏదీ నడపబోమని స్పష్టం చేశారు. భూనిర్వాసితులు, సమీప గ్రామాల ప్రజలు, మాజీ ఉద్యోగులు, కార్మికుల పిల్లలు అద్దె వాహనాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పించిన యాజమాన్యం వారికి అన్నివిధాలా అన్యాయం చేస్తోందన్నారు. తాము సంస్థలో వాహనాలు పెట్టి, అప్పులపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. తమకు సీఎంపీఎఫ్ కోత లేకుండా చూడాలని, యూనిట్ రేట్ పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తే సింగరేణి వ్యాప్తంగా 4 వేల వాహనాలు ఆగిపోయి, పనులు నిలిచిపోనున్నాయి. రామగుండం రీజియన్‌లో అయితే 400 వాహనాలు బంద్ కానున్నాయి.

డిమాండ్లు ఇవే..

- సీఎంపీఎఫ్ పూర్తిగా రద్దు చేసి, యూనిట్ రేట్ వేరియేషన్ పొందుపర్చాలి.
- యూనిట్ రేట్ 2017 నుంచి పెంచలేదు. వెంటనే పెంచాలి.
- టెండర్ కాలపరిమితి ఆరేళ్లకు పొడిగించాలి.
- అదనపు కిలోమీటర్‌కు రూ.20 పెంచాలి.
- ఓసీపీల్లో నడుస్తున్న అద్దె వాహనాలకు స్లాబ్ రేట్ పెంచాలి.
- 12 గంటల వాహనాలు రద్దు చేసి, 8 లేదా 16 గంటలు చేయాలి.
- టెండర్‌లో సీఎంపీఎఫ్ లేని వాహనాల కాలపరిమితి ముగిస్తే వాటికి కటింగ్ లేకుండా బిల్లులు చెల్లించాలి.
- గనిలో ప్రమాదాలు జరిగితే యాజమాన్యమే బాధ్యత వహించాలి.

ఆర్థికంగా నష్టపోవద్దు

డిమాండ్లు నెరవేర్చడం మా పరిధిలో లేదు. వాహన యజమానులు సమ్మె చేసి, ఆర్థికంగా నష్టపోవద్దు. ఈ అంశాలపై కార్పొరేట్ స్థాయిలో చర్చించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– ఆర్జీ-2 జీఎం మనోహర్

పెద్దంపేటలో భూసేకరణ పూర్తి చేయండి

- కలెక్టర్‌ను కోరిన ఆర్జీ-2 జీఎం మనోహర్



కలెక్టర్‌ను కలిసిన జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీ-3 విస్తరణ కోసం ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ బుధవారం కలెక్టర్ సంగీత సత్యనారాయణను కలిశారు. భూసేకరణలో సమస్యలపై చర్చించారు. బొగ్గు అవసరాల దృష్ట్యా రామగిరి మండలంలోని పెద్దంపేట గ్రామంలో భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జీఎం వెంట సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, ఎస్టేట్స్ అధికారి సురేష్‌బాబు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుమన్

గోదావరిఖని(రామగుండం): సీజనల్ వ్యాధుల పట్ల కార్మిక కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ-1 సింగరేణి ఆరోగ్య అధికారి సుమన్ తెలిపారు. బుధవారం జీడీకే-1,3 గనిపై కార్మికులకు అవగాహన కల్పించారు. దోమల నుంచి వచ్చే డెంగీ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో డెంగీ వేగంగా వ్యాప్తి చెందుతుందని, పగటిపూట ఎక్కువగా కుడతాయన్నారు. నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ నివారణకు టీకాలు లేవని, దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి కాలు ష్యంతో టైఫాయిడ్, కలరా, హెపటైటిస్‌బీ వంటి అంటు వ్యాధుల సోకకుండా నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. గని మేనేజర్ రమేశ్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీ చెరువు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గోదావరిఖని తిలక్‌నగర్ చెందిన సింగరేణి కార్మికుడు బాబు బంధువైన మహిళను బైక్‌పై తీసుకుని గోదావరిఖని నుంచి కాలనీవైపు వస్తున్నారు. వీర్లపల్లికి చెందిన ఓసీపీ-3 ప్రైవేట్ డ్రైవర్ లక్ష్మణ్ బైక్‌పై గోదావరిఖని వైపు వెళ్తున్నాడు. పోతనకాలనీ చెరువు వద్దకు రాగానే రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మహిళ తీవ్రంగా గాయపడింది. మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108లో సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రెండు బైకులను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు..

మంథని: భట్టుపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లికి చెందిన అల్లనూరి సమ్మయ్య తన భార్య పుల్లమ్మతో కలిసి బుధవారం ద్విచక్రవాహనంపై మంచిర్యాల నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. మార్గమధ్యలో భట్టుపల్లి వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. దారి వెంట వెళ్తున్నవారు గమనించి, వారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, గోదావరిఖని తరలించారు.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

పెద్దపల్లిరూరల్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయం నుంచి పొందాలని డీఈవో మాధవి తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగు, లోయర్, హయ్యర్ పరీక్షలు జరిగాయ న్నారు. పాసైన వారు హాల్ టికెట్, ఆధార్‌కార్డు జిరాక్సులు సమర్పించి, సర్టిఫికెట్లు తీసుకెళ్లాలన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు



వాహనాల యజమానులతో మాట్లాడుతున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థలో అద్దె వాహనాల యజమానుల సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందామని ఆర్జీ-3 జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. అద్దె వాహనాల యజమానులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు అందించిన నోటీసు నేపథ్యంలో బుధవారం జీఎం కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో యాజమాన్యం అద్దె వాహనాల యజమానులతో చర్చించిందని, డిమాండ్లు నెరవేర్చేందుకు మూడు నెలల సమయం కోరిందని తెలిపారు. సీఎంపీఎఫ్ రికవరీ చేయమని కోర్టు ఆర్డర్లు ఉన్నందున తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల గడువు ఇస్తే మీకు అనుకూలమైన నిర్ణయాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. సమ్మెకు పోతే చాలా నష్టం జరుగుతుందని, వెళ్లవద్దని సూచించారు. ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఎస్‌వోటూ జీఎం డి.బైద్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఆర్జీ-3, ఏపీఏ ఏరియా భూ నిర్వాసిత అద్దె వాహనాల యాజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ అవినాష్, సభ్యులు వి.రాజు, ప్రసాద్, శ్రీనివాస్, నాగరాజు, ప్రవీణ్ యాదవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ యంత్రాల వినియోగంపై సమీక్ష



వీసీలో పాల్గొన్న అధికారులు

కమాన్‌పూర్(రామగిరి): భారీ యంత్రాల వినియోగం, సీహెచ్‌పీల ద్వారా బొగ్గు రవాణా తీరుపై సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) ఎన్.శ్రీనివాస్, డైరెక్టర్(ప్రాజెక్టు-ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డిలు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు భారీ యంత్రాల వినియోగం, ఓపెన్‌కాస్ట్-1, సీహెచ్‌పీ పనితీరుపై పలు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ.. భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, నిర్దేశించిన బొగ్గు, ఓబీ లక్ష్యాలను అధిగమించాలని, సీహెచ్‌పీల నుంచి బొగ్గు రవాణా త్వరగా చేయాలని, వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు, సీహెచ్‌పీ డీజీఎం కాశీ విశ్వేశ్వరరావు, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూలిన ఓసీపీ-3 ప్రాజెక్టు ప్రహరీ



కూలిన గోడను పరిశీలిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లిలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఓసీపీ-3 ప్రాజెక్టు ప్రహరీ కూలింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోడ వైపు నీరు భారీగా నిలించింది. దీంతో బుధవారం తెల్లవారుజామున 30 మీటర్ల వరకు ప్రహరీ కూలిపోయింది. ఒక్కసారిగా నీరు బయటకు వచ్చి, రోడ్డు పక్కనే ఉన్న పలు దుకాణాలు, ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఆందోళనకు గురై, బయటకు పరుగు తీశారు. కూలిన గోడను సింగరేణి అధికారులు పరిశీలించారు. ఆ స్థానంలో కొత్తగా గోడ నిర్మించే ముందు తమకు పరిహారం చెల్లించాలంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. మిగతా గోడ కూడా కూలే ప్రమాదం ఉందని, ప్రజలకు నష్టం జరిగితే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ సర్పంచ్ బుర్ర ముత్యాలగౌడ్ హెచ్చరించారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటోందని, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరారు.

కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు

- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ అన్నారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలను, రైతులను, సింగరేణి కార్మికులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒక్కటేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. చట్టరీత్యా కార్మికులకు రావాల్సిన 19 శాతం అలవెన్స్ తీసుకురావడంలో ఐఎన్‌టీయూసీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కార్మికులకు రావాల్సిన ఏరియర్స్ రూ.9 కోట్లను 3, 4 నెలల్లో చెల్లించేలా చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు 35 శాతం లాభాల బోనస్ ఇవ్వడంతోపాటు కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని, సింగరేణికి చెల్లించాలసిన రూ.వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే.అక్బర్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు నరసింహారెడ్డి, వడ్డేపల్లి దాస్, మార్కం డేయ, వికాస్ కుమార్, మహేశ్ కుమార్, చిన్నయ్య, సలీం పాషా, కేవీపీ చారి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచాలంటూ తల్లిదండ్రులపై దాడి

- కుమారుడిపై కేసు



గాయపడిన రాజమ్మ, చిన్న పోశాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఆస్తి పంచాలంటూ ఓ వ్యక్తి తన తల్లిదండ్రులపై కర్రతో దాడి చేశాడు. వారు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కొమ్ము రాజమ్మ–చిన్న పోశాలు దంపతులకు రాయమల్లు ఒక్కడే కుమారుడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాయమల్లు కొంతకాలంగా తనకు ఆస్తి పంచి ఇవ్వాలంటూ తల్లిదండ్రులతో గొడవ పడుతుండగా వారు ససేమిరా అంటున్నారు. బుధవారం కూడా ఇదే విషయమై గొడవ జరగడంతో కోపోద్రిక్తుడయ్యాడు. కర్రతో తల్లిదండ్రులపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చిన్న పోశాలు ఫిర్యాదు మేరకు రాయమల్లుపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అపోలో రీచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: అపోలో రీచ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ అనిల్‌కుమార్ ముల్వార్, న్యూరో వైద్యుడు సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం దవాఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన కాశెట్టి శ్రీనివాస్, అంజలి దంపతుల కూతురు సాయిశ్రీ పాఠశాలలో అకస్మాత్తుగా కిందపడిపోవడంతో కుడి కాలు, కుడి చేయి చచ్చుపడిపోయి, మాట కూడా రాలేదు. తల్లిదండ్రులు దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అపోలో రీచ్ ఆస్పత్రిలో చేర్పించారు. సాయిశ్రీని పరీక్షించిన డాక్టర్లు మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల కాలు, చేయి పడిపోయాయని గుర్తించారు. అత్యాధునిక ఫిలిప్స్ ఆజ్యూరియన్ వంటి సాంకేతికతతో సెరబ్రల్ యాంజియోగ్రఫీ, మెకానికల్ తంబెక్టమి అనే ప్రత్యేక పద్ధతిలో ఆపరేషన్ చేశారు. అయితే ఇంత చిన్న వయసులో రక్తం గడ్డకట్టడం ఏమిటన్న సందేహంతో పాపకు మరిన్ని పరీక్షలు నిర్వహించగా గుండె లోపల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీన్ని వైద్య భాషలో ఎలమిట్బోమా అంటారని, ఇది అరుదుగా వస్తుందని తెలిపారు. చిన్నారికి వెంటనే ఆపరేషన్ చేసి, కణితిని తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాప పూర్తిగా కోలుకుందన్నారు. సమావేశంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ నాగసతీశ్, వైద్యులు, సిబ్బంది, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన దొంతుల కొంరయ్య(40) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంరయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రెండేళ్ల క్రితం అప్పు చేసి, కూతురికి పెళ్లి జరిపించాడు. అప్పు ఇచ్చినవారు అడుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంటి ఆవరణలోని పశువుల కొట్టంలో క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.